సాక్షి నిర్మల్

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



నాడు హక్కుల కోసం.. 8లో▸

హక్కులకోసం నిజాంతో పోరాడిన కుమురం భీం ఆశయాలు నేటికీ నెరవేరలేదు. గిరిజనులు నేడు మౌలిక సదుపాయాల కోసం పోరాడాల్సిన పరిస్థితి నెలకొంది.



మొక్కజొన్న కోతలు షురూ 9లో▸

వానాకాలంలో సాగు చేసిన మొక్కజొన్న పంట కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు కోతల్లో బిజీగా ఉన్నారు. కొందరు నూర్పిడి చేసి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం 31.3 /23.3

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్థానిక ఎన్నికల్లో గెలవాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశం



మంత్రి జూపల్లిని సన్మానిస్తున్న జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలు

నిర్మల్‌టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎంపిక చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సోమవారం సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రచారంలో పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని తెలిపారు. అనంతరం మంత్రిని నేతలు శాలువాతో సత్కరించారు. సమావేశంలో మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాలచారి, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.


తీరని యూరియా కష్టాలు



చెప్పులు వరుసలో పెట్టి నిరీక్షిస్తున్న రైతులు

కడెం: వరి పొలాలు కోత దశకు వచ్చాయి. సోయా పంట కోతలు మొదలయ్యాయి. పత్తి ఏరుతున్నారు. ఈ సమయంలో కూడా యూరియా కొరత తీరడం లేదు. నెల రోజులుగా యూరియా కోసం ధర్నాలు, ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. అయినా సరిపడా అందడం లేదు. మండలంలోని పాండ్వాపూర్ పీఏసీఎస్ కార్యాలయానికి సోమవారం లారీ యూరియా వచ్చింది. దీంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఇలా చెప్పులను వరుసలో పెట్టి వేచిచూశారు. ఒక్కో బస్తా ఇవ్వడంతో అందినవారు సంతోషంగా, అందనివారు నిరాశగా వెనుదిరిగారు.


కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులు

నిర్మల్‌టౌన్: జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్లో సోమవారం కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ గ్రేడింగ్ టెస్ట్‌లో జిల్లా నుంచి 11 మంది విద్యార్థులు నేషనల్ బ్లాక్‌బెల్ట్ (3వ సాదన్)కు అర్హులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ అర్హులైన విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా చీఫ్ ఎగ్జామినర్ తేజేందర్ సింగ్‌భాటియా, జిల్లా అధ్యక్షుడు కొండాజీ శ్రీకాంత్, టెక్నికల్ డైరెక్టర్ చందుల స్వామి, జిల్లా సెక్రెటరీ అమ్ముల భూషణ్, శిక్షకులు శ్రీకాంత్, కిరణ్, శేఖర్, చిరంజీవి, మనీషా, శివ, మేఘన, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

మసల్గ తండాను సందర్శించిన ఉప వైద్యాధికారి




బాధితులతో మాట్లాడుతున్న ఆకాశ్

తానూరు: మండలంలోని మసల్గ తండాను జిల్లా ఉపవైద్యాధికారి ఆకాశ్ సోమవారం సందర్శించారు. గ్రామంలో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా ఉప వైద్యాధికారి ఆకాశ్, ఆస్పత్రి సిబ్బందితో గ్రామానికి చేరుకుని వారి వివరాలను సేకరించారు. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్న రిపోర్టులు పరిశీలించారు. గ్రామంలో మరో నలుగురి రక్త నమూనాలను సేకరించారు. త్వరలో పరీక్షల వివరాలు వెల్లడిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఆయన వెంట సూపర్వైజర్ అబ్దుల్ ఖాసిం, సిబ్బంది ఉన్నారు.

రిజర్వేషన్.. టెన్షన్..!

- ఆశావహుల్లో పరేషాన్
- 8న తీర్పు ఏమొస్తుందో..!?
- రిజర్వేషన్ల మార్పులు, చేర్పులపై చర్చ



నిర్మల్: స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయా.. ఉండవా..! అనే విషయం బుధవారం హైకోర్టు ఇచ్చే తీర్పుపై ఆధారపడి ఉంది. ఈ తీర్పు ఎలావస్తుందో.. ఇవే రిజర్వేషన్లు ఉంటాయా.. లేక మారుతాయా..! అనే టెన్షన్ ఆశావహుల్లో నెలకొంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తీర్పు ఎలావచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న వాదన అధికార పార్టీ వర్గాల్లో ఉంది. ఒకవేళ పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు చేపడితే.. ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్లలో మార్పులు, చేర్పులు ఎలా ఉంటాయోనని ఆశావహుల్లో ఆందోళన కనిపిస్తోంది.

8న హైకోర్టు తీర్పు?

ఈనెల 9న రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఎన్నికల సిబ్బందికి శిక్షణ సైతం పూర్తిచేసేస్తోంది. కానీ.. అంతకు ఒక్కరోజు ముందు అంటే బుధవారం హైకోర్టులో ఎన్నికల భవితవ్యం తేలిపోనుంది. రాజ్యాంగానికి విరుద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలకు వెళ్లడంపై వేసిన కేసుకు సంబంధించిన తీర్పు ఈనెల 8న రానుంది. చట్టబద్ధత లేని రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు అనుమతి ఉండకపోవచ్చన్న వాదన బలంగా ఉంది. మరోవైపు మరో అవకాశం ఏదైనా ఇవ్వొచ్చు.. అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లేనిపక్షంలో పాత రిజర్వేషన్ల కోటా ప్రకారమైనా ఎన్నికలను కొనసాగించవచ్చని అధికార పార్టీవర్గాలే వెల్లడిస్తున్నాయి.

ఆశావహుల్లో ఆందోళన..

ఇటీవల ప్రకటించిన షెడ్యూల్, అధికారులు వెల్లడించిన రిజర్వేషన్ల ప్రకారం చాలామంది ఆశావహులు ఇప్పటికే మానసికంగా ఎన్నికలకు సిద్ధమయ్యారు. కానీ.. బుధవారం కోర్టు తీర్పు ఎలా ఉంటుంది, దానిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది, ఎన్నికలతోపాటు ప్రకటించిన రిజర్వేషన్లలోనూ మార్పులు ఉంటాయా.. అన్న టెన్షన్ చాలామందిలో కనిపిస్తోంది. ప్రస్తుతం పోటీకి అవకాశం ఉన్న ఆశావహులతోపాటు రిజర్వేషన్ కారణంగా పోటీకి దూరమవుతున్న నేతలూ '8న ఏమొస్తుందో చూద్దాం..'అంటూ ఆసక్తిగా వేచిచూస్తున్నారు.

బడుగులకు పీఠం..!

నిర్మల్ 2016లో జిల్లాగా ఏర్పడింది. ఆతర్వాత 2019లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించారు. తొలిసారి జిల్లాలో జరిగిన ఎన్నికల్లో జెడ్పీచైర్మన్ పీఠం జనరల్ మహిళకు కేటాయించారు. ఈమేరకు అప్పుడు బీఆర్‌ఎస్ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొరిపెల్లి విజయలక్ష్మి నిర్మల్‌రూరల్ జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలిచి చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకున్నారు. ఈసారి ప్రకటించిన రిజర్వేషన్లలో జెడ్పీచైర్మన్ స్థానం బీసీ జనరల్‌కు వచ్చింది. బడుగుల జనాభా ఎక్కువగా ఉన్న జిల్లాలో తొలిసారి వెనుకబడిన కులాలకు చైర్మన్ స్థానం దక్కనుంది. ఈమేరకు బీసీ సామాజిక వర్గాలకు చెందిన పలువురు సీనియర్, జూనియర్ నేతలు తాము చైర్మన్ బరిలో ఉండాలని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలూ చేస్తున్నారు.

హాజరు అంతంతే..!

- దసరా సెలవుల తర్వాత బడికి రాని విద్యార్థులు
- శనివారం 15%, సోమవారం 25% మాత్రమే నమోదు

నిర్మల్ రూరల్: దసరా సెలవుల అనంతరం ప్రభుత్వ బడులకు విద్యార్థులు రావడం లేదు. హాజరు శాతం చాలా తక్కువగా నమోదవుతోంది. దాదాపు 15 రోజులపాటు ఆనందంగా గడిపిన విద్యార్థులు బడి ముఖం చూడడానికి ఇష్టపడడం లేదు. మరో రెండు రోజుల తర్వాత హాజరు పెరిగే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన విద్యార్థులు తిరిగి రాకపోవడమే తక్కువ హాజరుకు కారణమని అంటున్నారు.

మొదటి రోజు 15%, రెండోరోజు 25%..

విద్యార్థులకు గతనెల 20 నుంచి ఈనెల 3 వరకు 14 రోజులపాటు దసరా సెలవులు ఇచ్చారు. సెలవుల తర్వాత శనివారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయులు బడులకు హాజరు కాగా, విద్యార్థులు మాత్రం మొదటి రోజు కేవలం 15% మాత్రమే హాజరయ్యారు. రెండో రోజు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో 25 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. మరో రెండు రోజులపాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం అంతంతమాత్రంగానే ఉంటుందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో హాజరు శాతం మరింత తక్కువగా ఉంది. రెండు రోజుల్లో కలుపుకుని కేవలం 18 శాతం మంది విద్యార్థులే హాజరయ్యారు. దూర ప్రాంతాల నుంచి రావడంతోపాటు, ఆది సోమవారాల్లో జిల్లాలో భారీ వర్షం కురవడంతో రెసిడెన్షియల్ పాఠశాలలకు విద్యార్థులు చేరుకోలేకపోయారు. 200 మంది విద్యార్థులు ఉన్న బడుల్లో కేవలం ఐదు నుంచి పది మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పకుండా క్విజ్, ఆటలు, జనరల్ నాలెడ్జ్, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

రెండు రోజులు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు

		4వ తేదీ	6వ తేదీ
జిల్లాలో ఉపాధ్యాయుల సంఖ్య	7,074	98 %	90%
జిల్లాలో విద్యార్థుల సంఖ్య	48,563	15%	25%

భీం త్యాగానికి గౌరవం

- వర్ధంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం
- జోడేఘాట్‌లో నేడు కార్యక్రమాలు..
- ముస్తాబైన వీరుడి పోరుగడ్డ
- హాజరు కానున్న రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు
- పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు



జోడేఘాట్‌లోని భీం మ్యూజియం ముఖద్వారం

కెరమెరి(ఆసిఫాబాద్): నిజాం సర్కారుకు వ్యతిరేకంగా, ఆదివాసీల హక్కుల కోసం ప్రాణాలర్పించిన భీం త్యాగాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. జల్.. జంగల్.. జమీన్.. నినాదంతో పోరాడి అమరుడైన కుమురంభీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో కెరమెరి మండలం జోడేఘాట్‌లో మంగళవారం భీం వర్ధంతి అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం నివాళులర్పించనున్నారు. ఉదయం 8 గంటలకు జెండాలు ఆవిష్కరించనున్నారు. 9 గంటలకు సమాధి వద్ద పూజలు చేసి, 10 గంటలకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఏర్పాట్లు పరిశీలించి, అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

పదివేల మందికి పైగా హాజరు..

ప్రభుత్వం భీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంతో అందుకు తగిన విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవలే భీం విగ్రహానికి మెరుగులు దిద్దారు. ట్రాక్టర్లతో పరిసరాలు, పార్కింగ్ స్థలాలు చదును చేయించి.. ప్రజలు కూర్చునేందుకు వీలుగా టెంట్లు వేస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నారు. భోజన సదుపాయం కూడా కల్పించనున్నారు. 10వేల మందికి పైగా హాజరవుతారని అంచనా వేస్తుండగా, 12 వేల మందికి భోజనాలు సిద్ధం చేస్తున్నారు. హెలిప్యాడ్ సైతం సిద్ధం చేశారు. మారుమూల ప్రాంతం కావడంతో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. ఏఎస్పీ, డీఎస్పీతోపాటు సీఐ, ఆర్‌ఐలు 8 మంది, ఎస్సైలు 25, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు 51 మంది, ఇతర సిబ్బంది 136, డబ్ల్యూపీసీలు 56, హోంగార్డులు 79 మంది, ఇతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. బాంబు, డాగ్ స్క్వాడ్‌తో జోడేఘాట్‌కు చేరుకునే రహదారుల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏటీడబ్ల్యూవోలు ముగ్గురు, సీఆర్‌టీలు, రెగ్యులర్ ఉపాధ్యాయులు 100 మంది, వంట మనుషులు 70 మంది, ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు ఐదుగురు, ఇతర సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమించారు. ఐకేపీ సిబ్బంది 35 మంది, ఇంజినీరింగ్ శాఖకు చెందిన సిబ్బంది పది మందిని కేటాయించారు. ఆయా శాఖల సిబ్బంది సోమవారం రాత్రే జోడేఘాట్‌కు చేరుకున్నారు. ఆసిఫాబాద్ డిపో నుంచి ప్రత్యేక బస్సులను జోడేఘాట్‌కు నడపనున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల కోసం పార్కింగ్ స్థలాలు సిద్ధం చేశారు.

హాజరు కానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

రాష్ట్ర ప్రభుత్వం భీం వర్ధంతిని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరు కానున్నారు. అలాగే ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు నివాళులర్పించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రజాప్రతినిధులు కేవలం భీం విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి, పూజలకే పరిమితం కానున్నారు. ఆదివాసీలు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లేందుకు ఏటా నిర్వహించే దర్బారు కోడ్ కారణంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

కోతలకు వానలతో ఆటంకం

- చేలల్లో నిలుస్తున్న నీరు..
- బురద నేలల్లో యంత్రాలతో కోయలేని పరిస్థితి
- చైన్ మిషన్ల కోసం నిరీక్షణ..



భైంసా డివిజన్‌లో సోయాపంటను ఆరబెడుతున్న రైతులు



భైంసా మండలం సిరాల శివారులో వర్షం రాగానే సోయాను కాపాడుకునేందుకు రైతుల ప్రయత్నాలు

భైంసా/భైంసారూరల్: జిల్లాలో సోయా పంట చేతికి వచ్చింది. కోతలు మొదలయ్యాయి. ఈ సమయంలో అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు చేలల్లో నీరు నిలిచి చిత్తడిగా మారుతున్నాయి. దీంతో యంత్రాలతో కోయలేని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా 1.05 లక్షల ఎకరాల్లో సాగు చేసిన సోయా పెద్ద ఎత్తున దెబ్బతింది. మొత్తం 72,300 మంది రైతులు ఈ సీజన్‌లో ఆశతో పంట వేసినా, గత నెల రోజులుగా కుండపోత వానలకు దిగుబడి ఆశలు తగ్గిపోయాయి.

వానలే అడ్డంకి

ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వర్షం సోమవారం వేకువజామున మరింత వేగం అందుకుంది. భైంసా డివిజన్‌తోపాటు పలు మండలాల్లో వర్షం.. సోయా కోతలకు అడ్డంకిగా మారింది. ఎండిపోయిన చేలు వర్షాలకు బురదమయమై పంట కోయడం చిక్కుగా మారింది. ఆకులు రాలిన మొక్కలు తడిసి ఉబ్బిపోతుండటంతో గింజలు నల్లబడుతున్నాయి.

చైన్ మిషన్‌లే ఆధారం

రైతులు మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి చైన్ మిషన్‌లను అద్దెకు తెచ్చుకొని కోత కొనసాగిస్తున్నారు. గంటకు రూ.2,400 నుంచి రూ.2,800 చెల్లించి బురద నేలల్లోనూ పంట కోయిస్తున్నారు. సాధారణ హార్వెస్టర్లు బరువుతో బురదలో ఇరుక్కుపోతుండగా, తేలికైన చైన్ మిషన్‌లు పనిచేయడం సులభమవుతోంది. ఒక్కో ఎకరానికి గంట నుంచి రెండు గంటల సమయం పడుతోంది.

ఇంకా 70% కోత మిగిలే ఉంది

జిల్లాలో 70 శాతం భూముల్లో కోత ఇంకా పూర్తికాలేదు. కోసిన గింజల్లో తేమశాతం పెరిగిపోవడంతో రంగు మారిపోతుంది. వర్షాల కారణంగా కొద్దిసేపట్లోనే నల్లబడిన గింజలు మార్కెట్ విలువ కోల్పోతున్నాయి. వర్షం తగ్గితేనే రైతులు మిగిలిన పంట కోసి, ఆరబెట్టి, అమ్మకాలకు సిద్ధం చేసే అవకాశం ఉంటుంది.

పంట ఆరబెట్టే సమస్య

కోత అనంతరం కల్లాలపై లేదా గ్రామ సమీప రహదారుల పక్కన సామూహికంగా సోయాను ఆరబెడుతున్న రైతులు వానలతో మళ్లీ ఇబ్బంది పడుతున్నారు. టర్పాలిన్‌లు ఉంచినా లోపలికి నీరు చేరి గింజలు నాని మొలకెత్తుతున్నాయి. దీంతో రైతులు రోజంతా జాగరణ చేసి వర్షం ఆగగానే టర్పాలిన్‌లు తొలగించి గింజలు ఆరబెడుతున్నారు. నీరు నిలవకుండా కల్లాల చుట్టూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కుంటాలలో భారీ వర్షం..



పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

కుంటాల: మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో పంటలకు నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన సోయా దెబ్బతింది. కల్లాల్లో ఉంచిన సోయా తడిసి ముద్దయింది. ఆరబెట్టేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. ఏరాల్సిన పత్తి పంటలో వర్షపు నీరు నిలవడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. 24 గంటల్లో 21.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయికృష్ణ తెలిపారు.

రోజంతా కల్లాల వద్దే..



పంట కోతలకు వర్షం ఆటంకంగా మారింది. మరోవైపు కోసిన పంట ఆరబెట్టినా.. వర్షానికి తేమ పెరుగుతోంది. గింజలు రంగు మారుతున్నాయి. దీంతో కుటుంబమంతా కల్లాల వద్దే ఉండి ఆరబెట్టాల్సి వస్తోంది. కొత్త టార్పాలిన్‌లు కొని కింద వేసి పంటను ఆరబెడుతున్నాం. ప్రతీరోజు సోయా కుప్పలను ఒకచోటు నుంచి మరోచోటుకు మారుస్తున్నాం. – దత్త, రైతు మాంజ్రి

వర్షాలు తగ్గే వరకు ఆగాలి..

జిల్లా వ్యాప్తంగా ప్రతీరోజు ఏదో ఒకచోట వర్షం కురుస్తూనే ఉంది. తుపాను ప్రభావంతో భారీ వర్షం కురిసింది. వర్షంతో చేలన్నీ తేమగా ఉన్నాయి. ఎండలు కాస్తే తేమశాతం తగ్గుతుంది. వర్షాలు తగ్గే వరకూ పంట కోయకపోవడమే మంచిది. ఇప్పుడు పంట కోసినా.. కోసిన పంట ఎండాలన్న ఇబ్బందులు తప్పవు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులతో అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం జిల్లాస్థాయి అండర్-14 బాలురు, అండర్-17 బాల, బాలికలకు బాక్సింగ్ పోటీలను నిర్వహించారు. అండర్-17 బాలుర విభాగంలో ప్రవీణ్(46-48 కిలోలు), సార్యన్‌రెడ్డి(48-50 కిలోలు), శ్రీకాంత్(52-57 కిలోలు), అండర్-14 బాలురు విభాగంలో అవయుక్త(28-30 కిలోలు), ధ్రువ(42-44 కిలోల), అద్విత్(44-46 కిలోలు) రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో హారిక(42 కిలోలు), సుహాసిని(42-44 కిలోలు), నిఖిత(44-46 కిలోలు), ఆర్.అక్షయ(46-48 కిలోలు), కీర్తన(48-50 కిలోలు), అభినయ(52-54 కిలోలు), శ్రావణి(63-66 కిలోలు), కవిత(66-70 కిలోలు) ఎంపికయ్యారు. వీరిని ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్ అభినందించారు.

అపార్ నమోదు ఆలస్యం

- జిల్లాలో మొత్తం విద్యార్థులు 1,42,872
- ఇప్పటి వరకు 67.34 శాతం పూర్తి



అపార్ నమోదును పరిశీలిస్తున్న ఎంఈవో

లక్ష్మణచాంద: విద్యార్థులకు ప్రత్యేక శాశ్వత గుర్తింపు నంబర్ ఇవ్వాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. 'ఒకే దేశం-ఒకే విద్యార్థి గుర్తింపు నంబర్' అనే నినాదంపై రూపొందిన ఈ పథకం ద్వారా ప్రతి విద్యార్థికి జీవితాంతం ఒకే అకాడమిక్ నంబర్ ఇవ్వబడుతుంది.

జిల్లాలో నమోదులో స్థితి

జిల్లా విద్యాశాఖ అధికారుల ప్రకారం, మొత్తం 1,42,872 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పటివరకు 96,157 మంది వివరాలు నమోదు చేశారు. మొత్తం నమోదు శాతం 67.34గా ఉంది. ఇంకా 45,962 మంది విద్యార్థుల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. అధికారులు ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు.

మండలాల ప్రగతి

జిల్లాలో లక్ష్మణచాంద మండలం 79.45 శాతంతో ముందంజలో ఉంది. భైంసా మండలం 79.09 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. పెంబి మండలం 43.15 శాతం నమోదుతో చివరిస్థానంలో కొనసాగుతోంది. మిగతా మండలాల్లో నమోదు శాతం 60కు పైగా చేరిందని అధికారులు పేర్కొన్నారు.

ఆలస్యానికి ప్రధాన కారణాలు

జిల్లాలో అపార్ నమోదులో జాప్యానికి విద్యార్థుల వ్యక్తిగత వివరాలు సక్రమంగా ఇవ్వనికారణంగానే జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

- పాఠశాల రిజిస్టర్‌లో ఉన్న పుట్టినతేదీ, ఆధార్‌లో ఉన్న తేదీ సరిపోకపోవడం.
- పుట్టిన తేదీ సరిచేయించుకునే సమయంలో ఆధార్ కేంద్రాల్లో సర్టిఫికెట్ సమస్యలు తలెత్తడం.
- కొందరు తల్లిదండ్రులు పిల్లల వివరాలు అందించటానికి వెనుకంజ వేయడం.
- కొంతమంది విద్యార్థుల ఇంటి పేర్లు అసంపూర్ణంగా ఉండడం.

ఈ కారణాల వల్ల నమోదు ప్రక్రియ నెమ్మదిగా సాగుతున్నట్లు అధికారులు వివరించారు.

అవగాహనతో వేగవంతం



జిల్లాలో 1,42,872 మంది విద్యార్థుల్లో 96,157 మంది నమోదు పూర్తిచేశాం. మిగిలిన విద్యార్థులు కూడా త్వరగా నమోదు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు సమావేశాలు ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించాం. తద్వారా జిల్లాలో శాతం 100 చేరుకునేలా చర్యలు తీసుకుంటాం.

– భోజన్న, జిల్లా విద్యాధికారి

పిలగాండ్లు పైలం!



నిర్మల్‌లో శని, ఆదివారాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆడిపాడిన మహిళలు రాత్రి సమీపంలోని బంగల్‌పేట్ చెరువులో నిమజ్జనం చేశారు. దీంతో సమీపంలోని ఇళ్లలో ఉండే చిన్నారులు బతుకమ్మలు పేర్చిన ప్లాస్టిక్ బుట్టలు, డబ్బాలను సేకరిస్తున్నారు. సోమవారం ప్రమాదకరంగా చెరువు అంచున నిలబడి ఇలా బుట్టల కోసం గాలించారు – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

క్లుప్తంగా

ఇచ్చోడలో రెండిళ్లలో చోరీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో ఆదివారం రాత్రి తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ జరిగింది. మండల కేంద్రానికి చెందిన గెడం చంద్రకాంత్ తమ స్వగ్రామం బజార్‌హత్నూర్ మండలంలోని జాతర్లకు, దమ్మపాల్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదిలాబాద్‌కు వెళ్లారు. గమనించిన దొంగలు తాళాలు పగలకొట్టి ఇళ్లలో చొరబడ్డారు. చంద్రకాంత్ ఇంట్లో 15 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.1.50 లక్షల నగదు, దమ్మపాల్ ఇంట్లో 2 తులాల బంగారం, రూ.85 వేల నగదు దోచుకెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

నర్సాపూర్(జి)లో..

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో శనివారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన లోక సునీత ఇంట్లో 20 గ్రాముల వెండి, రెండు గ్రాముల బంగారం, షేక్ సద్దాం ఇంట్లో 2 వెండి కడియాలు, 7 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అటవీప్రాంతంలో మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగపల్లి అటవీప్రాంతంలో సోమవారం వృద్ధుని మృతదేహం లభ్యమైనట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి తెలిపారు. రామకృష్ణాపూర్‌లోని అబ్రహంనగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు వేల్పుల ఎల్లయ్య (70) ఈ నెల 2న మేకలు మేపడానికి సారంగపల్లి అటవీప్రాంతానికి వెళ్లాడు. చీకటిపడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభ్యంకాకపోవడంతో 3న మృతుని కుమారుడు రమేశ్ రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం మృతదేహాన్ని గమనించిన గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. రామకృష్ణాపూర్, మందమర్రి ఎస్సైలు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా వేల్పుల ఎల్లయ్య మృతదేహంగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పసిబిడ్డకు ప్రాణం పోసిన నియోనాటల్


వాహనంలో చిన్నారిని తీసుకెళ్తున్న సిబ్బంది

బజార్‌హత్నూర్: మండలంలోని డేడ్ర గ్రామానికి చెందిన నాగుల్‌వాడ్ నిఖిత సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే పసిబిడ్డ బరువు తక్కువగా, హార్ట్‌బీట్ వేగంగా ఉండటంతో వైద్యాధికారులు భీంరావ్, శిల్పా నియోనాటల్ అంబులెన్స్‌కు సమాచారం అందించారు. స్పందించిన పైలట్ శివకుమార్, ఈఎంటీ ప్రదీప్ నివాస్ నియోనాటల్ వాహనంతో వచ్చి చిన్నారిని రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

నాడు హక్కుల కోసం.. నేడు సౌకర్యాల కోసం

జల్, జంగల్, జమీన్ నినాదంతో నీరు, అడవి, భూమిపై హక్కులకోసం నిజాం ప్రభుత్వంతో పోరాడిన కుమురంభీం ఆశయాలు నేటికీ నెరవేరలేదు. ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీ గిరిజనుల జీవితాల్లో మాత్రం మార్పురాలేదు. నాయకుల మాటల్లోనే అభివృద్ధి అనే మాట నానుతుంది కానీ వారి జీవితాల్లో మాత్రం లేదన్నది నగ్నసత్యం. గూడేలు, తండాల్లో మౌలిక సదుపాయాల కోసం పోరాడాల్సిన పరిస్థితి నెలకొంది. నేడు కుమురం భీం 85వ వర్ధంతి సందర్భంగా కథనం.

- గిరిజనులకు తప్పని పోరాటం
- తాండవిస్తున్న సమస్యలు.. అభివృద్ధికి దూరంగా గూడేలు
- పోరు గ్రామాలను పట్టించుకోని పాలకులు
- చాలా పల్లెల్లో బడి, అంగన్‌వాడీ కేంద్రాలు లేవు


ఇదే జోడేఘాట్ గ్రామం


లైన్‌పటార్‌కు వెళ్లే రాళ్లు రప్పలతో కూడిన దారి

కెరమెరి(ఆసిఫాబాద్): హట్టి నుంచి జోడేఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఆప్రాంతం సుందర స్వప్నానికి నిదర్శనం. కుమురంభీం పోరాటం చేసిన 12 గ్రామాల్లో నేటికీ సమస్యలు తాండవిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో 322 కుటుంబాలు, 1592 మంది జనాభా నివాసం ఉంటున్నారు. 12 గ్రామాలకు 18 చేతిపంపులు ఉన్నాయి. ఆశ్రమ పాఠశాలలు 2, ప్రాథమిక పాఠశాల 1, అంగన్‌వాడీ కేంద్రాలు 3, పాట్నాపూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రం ఉన్నాయి. ఆయా గ్రామాలకు కేవలం 8 ఇందిరమ్మ గృహాలే మంజూరయ్యాయి. సాగునీరు, ప్రభుత్వ గృహాలు, పట్టాపాసు పుస్తకాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రుణాలు, రోడ్డు సౌకర్యాలులేక ఆయా గ్రామాలు బావురుమంటున్నాయి, మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నప్పటికీ నాణ్యత లోపించిందని కొన్ని గ్రామాల్లో బావులు, చెలిమెనీరు తాగుతున్నారు.

పోరు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు

జోడేఘాట్: నాలుగు చేతిపంపుల్లో ఒక్కటే పనిచేస్తోంది. రైతులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు రాలేదు. ఎనిమిదేళ్ల క్రితం ఐటీడీఏ అధికారులు సోలార్ సిస్టం బిగించినా నిరుపయోగంగానే ఉంది.


శివగూడ వాసులు తాగే మంచినీరు

జోడేఘాట్ కొలాంగూడ: గ్రామంలో ఒకే చేతిపంపు ఉన్నా పనిచేయకపోవడంతో బోరు నీటిపైనే ఆధారపడుతున్నారు. పాఠశాల లేక జోడేఘాట్‌కు వెళ్తున్నారు. అంగన్‌వాడి కేంద్రం లేదు.

టోకెన్‌మోవాడ్: గ్రామంలో ఒక్కరికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది.

బాబేఝరి కొలాంగూడ: గ్రామంలో చేతిపంపులు లేక ఇబ్బందిపడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు కిలోమీటరు దూరంలో ఉన్న బావినీటిని మోసుకురావాల్సిన పరిస్థితి.

బాబేఝరి గోండ్‌గూడ: గ్రామంలో మూడు చేతిపంపులు ఉన్నా వేసవిలో నీరు ఇంకిపోవడంతో గ్రామ సమీపంలో ఉన్న చెలిమె నీటిని తాగుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే ఇళ్లలోకి నీరు చేరుతుంది.

బాబేఝరి మహరాజ్‌గూడ: ఒకే చేతిపంపు ఉన్నా అదికూడా పని చేయడంలేదు. దీంతో గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న బావినీటిని తాగుతున్నారు.

శివగూడ: గ్రామంలో చేతిపంపు ఉన్నా పనిచేయకపోవడంతో చెలిమెనీరు తాగుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో చిన్నారులు బాబేఝరికి వెళ్తున్నారు.

చిన్నపట్నాపూర్: విద్యుత్ ఉంటేనే బోరు పని చేస్తుంది.

పెద్దపట్నాపూర్: పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు.

పాటగూడ: కానుగ మొక్కల విత్తనాలతో విద్యుత్ తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షించిన గ్రామం. ఒక్కరికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది.

లైన్‌పటార్: చేతిపంపు ఉన్నప్పటికీ వేసవిలో రెండు కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు మోసుకురావాల్సిన పరిస్థితి. టోకెన్‌మోవాడ్ నుంచి రోడ్డు సౌకర్యం లేక రాళ్ల రప్పలపై ప్రయాణం చేయాల్సి వస్తోంది.

పిట్టగూడ: పాఠశాల భవనం ఉన్నప్పటికీ ఉపాధ్యాయుడు లేక ఖాళీగా ఉంటోంది.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. గ్రామంలో ఒక్కరికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అందరికీ పక్కా గృహాలు మంజూరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. మిషన్ భగీరథ నీరు ప్రతీరోజు సరఫరా చేయాలి.

– ఆత్రం పావుగా, పాటగూడ

బీటీరోడ్డు నిర్మించాలి



టోకెన్ మోవాడ్ నుంచి లైన్ పటార్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలి. తక్షణమే అటవీ అధికారులు అసంపూర్తి రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి. ఐటీడీఏ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. నడక కష్టమవుతోంది.

– ఆత్రం భీంరావు, లైన్‌పటార్

పోరాటయోధుడు భీం

- నేడు జోడేఘాట్‌లో కుమురంభీం 85వ వర్ధంతి

ఆసిఫాబాద్: ఆదివాసీల ఆరాధ్యదైవం కుమురంభీం ఆసిఫాబాద్ మండలం సంకెపెల్లిలో కుమ్రం చిన్ను, సోంబాయి దంపతులకు 1901లో జన్మించారు. నిజాం నవాబు సాగించిన దోపిడీ, దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ వీరోచితంగా పోరాడాడు. జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాం ప్రభుత్వంపై పోరు కొనసాగించాడు. మేకల కోసం చెట్టుకొమ్మను కొట్టిన తన స్నేహితుడు పైకు చేతి వేళ్లను జంగ్లాత్ సేరేదార్ నరికించడాన్ని కళ్లారా చూసిన భీం కన్నీరు కార్చాడు. ఆదివాసీ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం లాంటి ఘటనలు ఆయనను తీవ్రంగా కలచివేశాయి. ఈ క్రమంలో తండ్రి చిన్ను విషజ్వరంతో మృతి చెందడంతో సోదరులు సోము, బొజ్జుతో పాటు చిన్నాయనలతో కలిసి సంకెపెల్లి వీడి కెరమెరి మండలంలోని సుర్దాపూర్ గూడేనికి చేరుకున్నాడు. అక్కడ ఆదివాసీలు అడవిని నరికి సేద్యం చేయగా పంట చేతికొచ్చే సమయానికి సిద్దిక్ అనే ముస్లిం జాగిర్దార్ వచ్చి సుర్దాపూర్ భూముల తమవేనని హుంకరించాడు. అతనిపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో భీం అక్కడి నుండి పారిపోయి బల్లార్షా మీదుగా మహారాష్ట్రలోని చాందా చేరుకున్నాడు. అక్కడ వినోభా అనే ఉద్యమకారుడు ఆశ్రయం ఇవ్వగా అక్కడ కొంతకాలం పనిచేసి అస్సాం వెళ్లిపోయాడు. అక్కడ కాఫీ తేయాకు తోటల్లో పనిచేస్తూ ఐదేళ్లపాటు అక్కడే ఉన్నాడు. ఆతర్వాత కెరమెరి మండలంలోని జోడేఘాట్ చేరుకున్నాడు.

గెరిల్లా పోరాటం

అస్సాం నుంచి తిరిగొచ్చిన కుమురంభీం జోడేఘాట్ కేంద్రంగా నిజాం సర్కార్‌తో గెరిల్లా పోరాటం చేశాడు. అతనికి కుడి భుజంగా సూరు, సహచరుడిగా వెడ్మరాము ఉన్నారు. దట్టమైన అడవుల్లో శత్రువుకూడా అడుగుపెట్టేందుకు సాహసించని కొండకోనల ప్రాంతం జోడేఘాట్ కేంద్రంగా ఉద్యమం చేశాడు. వెదురుతో విల్లంబులు, బాణాలు తయారు చేసి, ఉచ్చులు పెట్టడంపై యువకులకు శిక్షణ ఇచ్చాడు. ఒక్కొక్కరికి ఒక్కో బర్మారా నాటుతుపాకి సమకూర్చాడు. గ్రామాలన్నీ తిరుగుతూ అటవీశాఖ అధికారుల అరాచకాలపై ప్రజలను చైతన్య పరిచాడు. నాగలి, పారక, మేకులు, కంచెలపై నిజాం ప్రభుత్వం విధించే పన్నులు కట్టవద్దని నిజాం ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రకటించాడు. ఈ క్రమంలో అప్పుల పేరుతో పంటలను దోచుకునేందుకు వచ్చే వ్యాపారులు, పన్ను వసూళ్లకు వచ్చే రెవెన్యూ అధికారులపై భీం, అతని అనుచరులు దాడులు కొనసాగించారు. దీంతో బాబేఝరి కేంద్రంగా 12 పోరుగ్రామాలకు వెళ్లేందుకు పోలీసుల వెన్నులో వణుకు పుట్టిందంటే అతిశయోక్తికాదు. బాబేఝరి కేంద్రంగా గిరిజనులు అడవిని నరికి 12 గ్రామాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిజాం సర్కారు వారిపై కేసులు పెట్టింది. వాటి నుంచి విముక్తి కోసం నిజాం నవాబును కలిసేందుకు హైదరాబాద్ వెళ్లిన భీంకు నవాబు దర్శనం లభించక అవమానభారంతో తిరుగుముఖం పట్టాడు. అతను వచ్చేసరికి జంగ్లాత్ వాళ్లు 12 గ్రామాలను తగులబెట్టరు. దీంతో కలత చెందిన భీమ్ అటవీశాఖ అధికారులపై తిరగబడి తరిమికొట్టాడు. జల్.. జంగల్.. జమీన్ సాధించాలంటే ఇంటికో పోరాట యోధుడు కావాలని పిలుపునిచ్చాడు. గిరిజన యువకులందరినీ చేరదీసి సాయుధ దళం ఏర్పాటు చేశాడు.

అనుచరుడి వెన్నుపోటు

చివరి ప్రయత్నంగా నిజాం ప్రభుత్వం చర్చలకు సబ్‌కలెక్టర్‌ను జోడేఘాట్ పంపింది. 12 గ్రామాలకు పట్టాలిస్తామని, అప్పులన్నీ మాఫీ చేస్తామని సబ్ కలెక్టర్ ప్రతిపాదించాడు. కానీ భీం 12 పోరుగ్రామాల మీద రాజ్యాధికారం కావాలని డిమాండ్ చేయడంతో చర్చలు విఫలమయ్యాయి. విషయం నిజాం నవాబుకు తెలియడంతో ఆగ్రహానికి గురై భీంను అంతమొందించాలని ఆదేశించాడు. ఈ క్రమంలో 1940లో దాదాపు ఏడు మాసాల పాటు భీం అనుచరులు, నిజాం సేనల మధ్య యుద్ధం జరిగింది. అనుచరులు ఒక్కొక్కరు నేలకొరిగినా భీం వెన్ను చూపలేదు. దట్టమైన అడవిలో అతని ఆచూకీ కనుగొనడం ఎవరితరం కాలేదు. ఎట్టకేలకు భీం అనుచరుడు మడావి కొద్దు ఇచ్చిన సమాచారం మేరకు అక్టోబర్ 10న అశ్వియుజ పౌర్ణమి రోజున ఐదు గంటల పాటు సాగిన భీకర పోరులో భీం నేలకొరిగాడు. నాలుగు దశాబ్దాలుగా ఏటా జోడేఘాట్‌లో భీం వర్ధంతి నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివాసీ, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో దర్బార్ ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం జోడేఘాట్‌లో అధికారికంగా కుమురంభీం 85వ వర్ధంతి కార్యక్రమం ఆదివాసీ సంప్రదాయం ప్రకారం నిర్వహించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

నిప్పంటించుకొని మహిళ ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జాడి రాజన్న


గాయాలపాలైన లలిత

- అడ్డుకోబోయిన భర్తకు సైతం గాయాలు


నెన్నెల: దంపతుల మధ్య జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన భార్య ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గుండ్లసోమారం గ్రామానికి చెందిన జాడి రాజన్న, లలిత దంపతులకు కూతురు అంజలి, కుమారుడు తేజ ఉన్నారు. సోమవారం ఉదయం అంజలి సారీ ఫంక్షన్ విషయంలో ఇద్దరూ గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన లలిత ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. నుదురు, మెడ, రెండు చేతులు, ఛాతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. మంటలను ఆర్పే క్రమంలో రాజన్నకు చేయి, వీపుపై గాయాలయ్యాయి. దంపతులిద్దరిని 108లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా ఘటనపై ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

గేదెను ఢీకొని యువకుడు మృతి


అరవింద్ (ఫైల్)

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై గేదెను ఢీకొని యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... లోకేశ్వరం మండలం హవర్గాకు చెందిన సిందే అరవింద్ పటేల్ (30) సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై నిర్మల్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో 61వ జాతీయ రహదారిపై అడ్డుగా ఉన్న గేదెను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అరవింద్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. కాగా హెల్మెట్ ధరించి ఉంటే బతికేవాడేమోనని స్థానికులు చర్చించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


సాయినాథ్ మృతదేహం

తానూరు: మండలంలోని బెల్‌తరోడా చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. మహారాష్ట్రలోని ఉమ్రి గ్రామానికి చెందిన బోంద్రే సాయినాథ్ (26) తానూరులో ఉన్న బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా బెల్‌తరోడా చెక్‌పోస్ట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుకనుంచి మరో బైక్‌పై వస్తున్న బంధువులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డీఎస్పీ మృతికి సంతాపం


విష్ణుమూర్తి (ఫైల్)

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఫంక్షనల్ వర్టికల్స్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న విష్ణుమూర్తి ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేశారని, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని కొనియాడారు.ఆయన మృతి పోలీసు శాఖకు తీరని లోటన్నారు.

యువకుడు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: యువతి తన ప్రేమను నిరాకరించిందని మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ చిట్యాల శ్రీకాంత్ (20) కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. విషయాన్ని యువతికి తెలియజేయడంతో నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. అఘాయిత్యానికి పాల్పడే ముందు తన అన్నకు వీడియోకాల్ చేసి ఉరేసుకుంటున్నట్లు తెలిపాడు. అతను స్థానికులకు సమాచారం అందించడంతో కొన ఊపిరితో ఉన్న శ్రీకాంత్‌ను రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తండ్రి గజానన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన ట్రాక్టర్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సోమవారం అంకాపూర్ గ్రామ శివారులోని వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఓ ట్రాక్టర్ నీటి ప్రవాహంలో ఇరుక్కుపోయింది. దాన్ని బయటకు తీసేందుకు మరో ట్రాక్టర్ ద్వారా ప్రయత్నించగా అది నీటిలో కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బాక్సింగ్ ఎంపిక పోటీలు


జోనల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం అండర్–17బాలబాలికల జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి రమేశ్ ప్రారంభించగా వివిధ పాఠశాలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తొమ్మిది మంది ఎంపికయ్యారని, ఈనెల 8న నిర్మల్‌లో నిర్వహించేజోనల్ పోటీలలో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ యాకుబ్ తెలిపారు. పోటీల పర్యవేక్షకుడు రేణి రాజయ్య, వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు

బాసర: బాసర ఆర్జీయూకేటీ కళాశాలలో డిసెంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మకత పెంపొందించేందుకు ఇలాంటి సమ్మేళనాలు ఉపయోగపడతాయన్నారు. 1977లో పద్మశ్రీ డా.కిరణ్ సేత్ ఢిల్లీ ఐఐటీలో ప్రారంభించిన స్పిక్ మెకే దేశవ్యాప్తంగా యువతను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. సంగీతం, నృత్యం, జానపద కళలు, హస్తకళలు, చిత్రకళలతో పాటు భారతీయ తాత్విక విలువలను చేరవేయడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి కళాకారులు రానున్నట్లు తెలిపారు.

'నవోదయ'లో ప్రవేశానికి నేటితో ముగియనున్న గడువు

కాగజ్‌నగర్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి మంగళవారంతో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 678 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఎనిమిదో తరగతి, పదోతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఒకరి రిమాండ్

మామడ: ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన ఒకరిని సోమవారం అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని కిషన్‌రావుపేట్ గ్రామానికి చెందిన బానావత్ వెంకట్రావ్ జల్సాలకు అలవాటుపడి ఇటీవల పరిమండల్‌లో ధర్మన్నకు చెందిన స్టార్ స్పోర్ట్స్ బైక్‌తో పాటు ఆర్మూర్‌లో ప్యాషన్‌ప్రో దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు


- 18 తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ వహీదుద్దీన్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వహీదుద్దీన్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న దొంగలను పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన స్కావెంజర్ గాలోత్ కుషాల్ జూదానికి అలవాటు పడి డబ్బులు సరిపోకపోవడంతో తనవద్ద పనిచేసే ఓర్సు అనిల్‌తో కలిసి దొంగతనాలకు పాల్పడ్డాడు. కుషాల్ ఉదయం సమయంలో స్కావెంజర్‌గా తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి అనిల్‌తో కలిసి చోరీకి పాల్పడేవారు. ఈనెల 1న న్యూ కాలనీకి చెందిన ఎస్పీఎం ఉద్యోగి కిషోర్ కుమార్‌లోయ ఇంట్లోకి చొరబడి 213 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, ఇదే రోజు ఓల్డ్ కాలనీకి చెందిన ఎస్పీఎం కాంట్రాక్టర్ పిసపాటి హేమచంద్రరావు ఇంట్లో రూ.20వేల నగదు, ఎస్పీఎం ఉద్యోగి భూసాని నరేంద్రవర్మ ఇంట్లో రూ.13 వేల నగదు, గత నెల 29న ఓల్డ్ కాలనీకి చెందిన ఎస్పీఎం ఉద్యోగి సింగాని లక్ష్మణ్ ఇంట్లో రెండు తులాల బంగారు ఆభరణాలతో పాటు తులం వెండి, రూ.10వేల నగదు, మే 9న న్యూ కాలనీకి చెందిన ఎస్పీఎం ఉద్యోగి పొలుసాని భూపాల్ రావు ఇంట్లో రూ.23 వేల నగదు దొంగిలించారు. నిందితులను పట్టుకునేందుకు పట్టణ సీఐ ప్రేంకుమార్, రూరల్ సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. 50 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి సోమవారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 18 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బంది రాజు, నాగరాజు, సంపత్, నౌషద్, పురుషోత్తంను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐలు ప్రేంకుమార్, కుమారస్వామి, ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

మాలేపూర్‌లో ఎన్నిక ఏకగ్రీవమేనా..?

- ఒకే కుటుంబంలో సర్పంచ్, మరో నలుగురు వార్డు సభ్యులు?
- రిజర్వేషన్‌తో వరించనున్న అదృష్టం
- ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామ పంచాయతీ


మాలేపూర్ గ్రామం

నార్నూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒకే కుటుంబంలో సర్పంచ్, నలుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. గతంలో సైతం ఎస్టీ రిజర్వేషన్ రావడంతో ఆ కుటుంబం నుంచే సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మాలేపూర్ పంచాయతీ పరిధిలో మొత్తం 514 ఓటర్లు ఉన్నారు. ఈ సర్పంచ్ స్థానానికి ఎస్టీ మహిళగా రిజర్వేషన్ ఖరారు చేశారు. అయితే పంచాయతీ పరిధిలో ఎస్సీలు అధికంగా ఉన్నారు. గ్రామంలో మొత్తం 8 వార్డులకు గాను రెండు ఎస్టీ మహిళ, రెండు ఎస్టీ జనరల్‌గా రిజర్వేషన్ ఖరారయ్యాయి. అయితే గ్రామంలో ఒకే ఒక గిరిజన కుటుంబం నివాసం ఉంటుంది. ఆ కుటుంబంలో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు మొత్తం ఆరుగురు ఓటు హక్కు కలిగి ఉన్నారు. దీంతో వారిలో ఒకరు మహిళ సర్పంచుగా, నాలుగు వార్డులకు ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు వార్డుమెంబర్లుగా ఏకగ్రీవం కానున్నారు. ఉప సర్పంచ్ పదవీ సైతం వీరికే వరించే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎస్టీ జనరల్ ఖరారవగా పవార్ ఇందల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. అలాగే మరో మూడు వార్డుమెంబర్ స్థానాలు సైతం ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో ఆ ఇంటి నుంచే ముగ్గురు (ఇద్దరు పురుషులు, ఒక మహిళ) ఏకగ్రీవంగా ఎన్నికవడం గమనార్హం. ఈ ఏడాది కూడా సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ కలిసి రావడంతో ఈ సారి ఈ ఇంటి నుంచి ఐదుగురు ఎన్నికయ్యే అవకాశం కనిపిస్తోంది.

8న సైన్స్ డ్రామా పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ సెంటర్‌లో ఈ నెల 8న మానవాళి ప్రయోజనం కోసం సైన్స్, టెక్నాలజీపై జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌వో రాజగోపాల్ తెలిపారు. ఉప అంశాలుగా ఉమెన్ ఇన్ సైన్స్, స్మార్ట్ అగ్రికల్చరల్, డిజిటల్ ఇండియా, హైజీన్ ఫర్ ఆల్, గ్రీన్ టెక్నాలజీ అంశాలపై పోటీలు ఉంటాయన్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలికి చెందిన సుంకరి నగేష్ ఇత్తడి కొప్పెరను దొంగిలించిన అదే గ్రామానికి చెందిన అంగ భీమేష్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

డీజే నిర్వాహకుడిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేసి రోడ్డుపై ప్రజలకు ఇబ్బందులు కలిగించిన డీజే నిర్వాహకుడు రాథోడ్ రాంకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 4న దుర్గామాత నిమజ్జనోత్సవం సందర్భంగా ఏఎస్సై గోకుల్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రాత్రి శాంతినగర్‌లోని జగన్నాథ్ ఆస్పత్రి వద్ద పులిమడుగుకు చెందిన రాంకుమార్ రోడ్డుపై డీజే ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.